
- సాహితి




**హైదరాబాదు నుంచి వస్తున్నాను. కారు ఫ్రంట్‌గ్లాస్ మీద వర్షపు చినుకులు పడి, స్ట్రీట్‌లైట్ల వెలుతుర్లో తళుక్కుమని వైపర్స్ తగలగానే జారిపోతున్నాయి.**

**మధ్యాహ్నం రెండు గంటల్నించీ ఎడతెరిపిలేని వర్షం ఉందక్కడ. ఇక్కడా అదే పరిస్థితి లాగుంది. కనుచూపు మేరంతా వర్షానికి నానిపోయినట్టుంది. ఎదురుగా నల్లటి తారురోడ్డు ప్రస్ఫుటంగా మెరుస్తోంది.**

తెల్లారి నాలుగున్నరకి పెళ్ళి ముహూర్తం. నాదే. మూడు రోజుల ముందే లీవు పెట్టాను కానీ ఆఫీసులో ప్రాడొకటి బయటపడటంతో రిలీవ్ కాలేక పోయాను.

'వైకాన్ట్ యూ పోస్ట్‌పోన్?' జీఎం పొలైట్‌గా అడిగాడు. నా ప్రెజెన్స్ వాళ్ళకి చాలా అవసరం. అలాగని నా అవసరానికి విరుద్ధంగా ఉండమనీ ఇన్సిస్ట్ చెయ్యలేరు.

'అదింకా పెద్ద ప్రాడౌతుంది సర్!' చిన్నగా నవ్వి చెప్పాను. 'ఇన్విటేషన్ కార్డ్స్ వెళ్ళిపోయి, బంధువులంతా వచ్చేసి ఉంటారు. మేరేజి హాలు, కేటరింగు... వాట్‌నాట్? ఎవ్విరిథింగ్... ఆర్డరేచ్చేసి ఉంటారు. ఇప్పుడు ముహూర్తం పోస్ట్‌పోన్ చెయ్యటమంటే సాధ్యపడదు. ఫార్మాలిటీస్ అయిపోయాక వెంటనే వచ్చి జాయినౌతాను' కన్విన్స్ చేసి చెప్పి, బైటపడ్డాను.

కారు చాలా స్మూత్‌గా పోతోంది. విడిదింట్లోకి డైరెక్టుగా వెళ్ళిపోవటమే. అమ్మా వాళ్ళూ ఉదయమే వచ్చామని ఫోన్ చేసి చెప్పారు. నేనింకా రాలేదని ఆడపెళ్ళివారు తెగ టెన్షన్ పడుతున్నారట. మాటిమాటికీ వచ్చి అడుగుతున్నారట. ఇవన్నీ చెప్పి - వాళ్ళని మరీ అంత టెన్షన్లో పెట్టడం బావోదు. వీలైనంత ఎర్లీగా వచ్చెయ్. ఆఫీసూ, పనీ ఎప్పుడూ వుండేవే. ఇలాంటప్పుడు కూడా వదిలిపెట్టకపోతే ఎలా?' అని మందలించింది అమ్మ.

నిజమే!

ఒకప్పుడు పదహారురోజులపాటు పెళ్ళి వేడుకలు జరుపుకునేవారట. తర్వాత మూడు రోజులకి దిగింది. అక్కయ్య పెళ్ళి కార్యక్రమాలు ఒకరోజంతా జరిగాయి. నా దగ్గరికి వచ్చేసరికి వ్యవధి ఇంకా కుదించుకు పోతోంది. చిన్నగా నవ్వొచ్చింది.

యాక్సిలేటర్ రెయిజ్ చెయ్యబోతున్న నేను రోడ్డుకి మధ్యగా ఒక వ్యక్తి అడ్డు రావటంతో స్లో చేశాను. అతను ఆపమన్నట్లు చెయ్యూపుతున్నాడు. చుట్టూ చూశాను. కొద్దిదూరంలో ఒక కారు రోడ్డు మీంచీ కొంచెం దిగి బురదలో కూరుకుపోయి ఉంది. బహుశః అది అతనిదే అయివుంటుంది.

'లిఫ్ట్ ప్లీజ్!' దగ్గరికి వస్తూ అడిగాడు. మనిషి నిలువునా తడిసిపోయి ఉన్నాడు. ఏదో అర్జెంటు పని మీద వెళ్తుంటే ఈ అవాంతరం వచ్చినట్టు డెస్పరేట్‌గా ఉన్నాయి గెశ్చర్స్.

కారాపాను.

'భద్రకాళి గుడిదాకా... లిఫ్ట్ ఇవ్వగలరా ప్లీజ్?' అడిగాడు. అసలే టైమ్ లేదు. అతని కోసం మరో పావుగంటో... అరగంటో... కానీ కాదనలేక పోయాను.

'ఎక్కండి' అయిష్టంగానే అన్నాను.

అతను ఎక్కి కూర్చున్నాడు.

'సారీ టూ ట్రబుల్ యూ' సీట్లో సర్దుకుని హేంకీతో జుత్తులోంచీ మొహం మీదికి జారిపడుతున్న నీళ్ళని తుడుచుకుంటూ చెప్పాడు.

'ఇట్సాల్ రైట్' అని నా టవల్ ఇచ్చి, పాకెట్ లోంచీ ట్రిబుల్ ఫైవ్ తీసి, నేనొకటి వెలిగించుకుని, అతనికొకటి ఇచ్చాను. అందుకుంటూ, 'దయచేసి త్వరగా పోనివ్వగలరా?' అడిగాడు.

నేను స్పీడ్ పెంచాను.

కొద్దిసేపు మా మధ్య మౌనం చోటు చేసుకుంది.

'నాకీ వూరు కొత్త. ఎప్పుడూ రాలేదు. నా ఫ్రెండ్ చెప్పిన గుర్తుల ప్రకారం వస్తున్నాను. ఇంతలో వెనకొస్తున్న లారీకి సైడివ్వటం కోసం కొంచెం రోడ్డు దిగానంతే... స్కిడైంది. లారీ వెళ్ళిపోయింది. పావుగంట నుంచీ ఎదురుచూస్తున్నాను. ఏదైనా వెహికిల్ వస్తుందేమోనని... వర్షం చేతనేమో. ఒక్క ఆటో కూడా లేదు' అన్నాడతను మౌనాన్ని ఛేదిస్తూ.

'భద్రకాళీ టెంపుల్ దగ్గర ఎక్కడికి వెళ్ళాలి మీరు?'

నా ప్రశ్నకి అతను కొంచెం ఇబ్బందిగా నవ్వాడు. తర్వాత అన్నాడు. 'నా ఫియాన్సీ ఎదురుచూస్తుంటుందక్కడ. ఆమెని తీసుకుని వెళ్ళిపోవాలి'

'ఇంతరాత్రి... ఈ వానలో?...' దిగ్భ్రమతో తలతిప్పి చూసి, అడిగాను.

'ప్రేమ కూడా యుద్ధం లాంటిదే కదండీ? గెలవాలంటే కష్ట నిష్ఠూరాలని పట్టించుకోకూడదు' అన్నాడతను.

నేనిప్పుడు డీల్ చేస్తున్న వ్యవహారంతో ఒక ఆడపిల్ల జీవితం ముడిపడి వుందనేసరికి నాకు కొంత కుతూహలం కలిగింది. ఇంకొంచెం ఇన్వాల్వ్ కావాలనుకున్నాను. నా పక్కని కూర్చుని ఉన్న ఈ వ్యక్తి కరెక్ట్ పర్సన్ ఔనో కాదో!

'మీరేం చేస్తుంటారు?' కేజువల్‌గా అన్నట్లు అడిగాను. ఎవరో తెలీని ఆ అమ్మాయికి కేర్‌టేకర్ రోల్ వెయ్యసాగాను. ఇదంతా నాకు తెలీకుండానే... అంటే అప్రమేయంగానే జరిగిపోయింది.

అతను చెప్పాడు. తన జాబ్, క్వాలిఫికేషన్, జీతం... అన్నీ. ఎమ్‌సియ్యే చేసి, హైటెక్ సిటీలో సాఫ్ట్‌వేర్ సైడ్ చేస్తున్నాడట.

'మీ స్వంత విషయాల్లో కలగజేసుకుంటున్నా ననుకోక పోతే చెప్పండి. పెద్దవాళ్ళ అనుమతితో చేసుకోవచ్చు కద?'

నా ప్రశ్నకి అతను పెద్దగా నవ్వేశాడు. 'వాటే జోక్! ప్రేమించుకున్నామని పిల్లలంటే పెద్దవాళ్ళు వొప్పుకుంటారండీ? అసలీ టీవీలూ సినిమాలూ వచ్చి వాళ్ళని మరీ స్పాయిల్ చేసేస్తున్నాయి. కోటా శ్రీనివాసరావులాగా, అమ్రిష్‌పురిలాగా తయారౌతున్నారు ఫాదర్సంతా' అన్నాడు నవ్వుతూనే.

అతని మాటలకి నేనూ నవ్వేశాను. రెండు నిమిషాలు పట్టింది నన్ను నేను కంట్రోల్ చేసుకోవటానికి. అప్పుడు చురుగ్గా అడిగాను. 'జోకొద్దు. ప్లీజ్. సీరియల్‌గా చెప్పండి. ఇంత చదువుకుని కూడా పేరెంట్సుకి చెప్పకుండా ఇంట్లోంచీ వెళ్ళిపోవటమేమిటి?'

అతను కూడా సీరియసయ్యాడు. 'మీకు మన ప్రస్తుతపు వివాహ వ్యవస్థలోని కాన్సెప్ట్ తెలుసా? అత్తలు కోడళ్ళని వెతుక్కుంటారు. మామలు అల్లుళ్ళని వెతుక్కుంటారు. ఈ ప్రాసెస్‌లో పెళ్ళి చేసుకునే వారిద్దరి ఇష్టానిష్టాలకి గానీ అభిరుచులకి గానీ ఏ మాత్రం విలువలేదు.'

అతని మాటలకి నేను షాకయ్యాను. నిజమే! అక్కయ్య పెళ్ళికి నాన్న చాలా తిరిగాడు. ... తనకి అల్లుడనిపించుకోగలిగే అర్హతగల వ్యక్తి కోసం. అలాగే నాకు భార్యని వెతికే బాధ్యత అమ్మ తీసుకుంది. వాళ్ళు చూపించిన వారికి మేము ఓకే చెప్పాము.

'... అంతేకాదు. ఈ పెళ్ళనేది ఆస్తిఅంతస్థుల్నీ, కులగోత్రాలనీ, వంశమర్యాదల్నీ ప్రకటించుకునే వేదిక. ఇన్‌ది అదర్ సెన్స్... అహాన్ని ప్రకటించుకుని పారస్పరికంగా సంతృప్తిపరచుకునే వేదిక. పిల్లల ఇష్టానిష్టాలని లక్ష్యపెడితే ఆ అవకాశాలు పోతాయి...'

'మీరు పొరపడ్తున్నారేమో!' ఆ విషయంలోని వాస్తవం సూటిగా వచ్చి నా గుండెని తాకినా వోపెన్‌గా వొప్పుకోలేక ప్రతిఘటించాను.

'లేదు' స్థిరంగా అన్నాడు. 'ఆడపిల్ల పుట్టిందనగానే - ఇంక పొదుపు ఉద్యమం మొదలుపెట్టాలనుకునే పేరెంట్సున్న వ్యవస్థ మనది. పైసపైస కూడబెట్టి దాచి, ఆ పిల్లకి ఘనంగా పెళ్ళిచేసి అత్తవారింటికి పంపి, ప్రయోజకుల మనిపించుకోవాలన్నది వాళ్ళకి జీవితకాలపు ఆశయం. అందులో ఏ మాత్రం తేడా వచ్చినా తట్టుకోలేరు. ఇగో దెబ్బ తింటుంది. అసలందుకే, ప్రేమ పెళ్ళిళ్ళకి విముఖత ఎదురయ్యేది ఆడపిల్ల పేరెంటు నించే.'

'మీ ప్రాబ్లం చెప్పండి'

'మాదీ అదే ప్రాబ్లం. ఫస్ట్ ఆఫ్ ఆల్... ఆమె పేరెంట్సు వొప్పుకోలేదు'

'మీ వాళ్ళు?'

'ఎదిగొచ్చిన కొడుకుని వదులుకోవటం కన్నా రాజీ బెటరనుకున్నారు?'

'అసలీ క్లాష్ దేనికి?'

'మా కులాలు వేరు.'

'... ...'

'తను పీజీ చేసింది. ఇంట్లో మేచెస్ చూడబోతే మా గురించి చెప్పిందట. అంతే... ఆమెకి నయానాభయానా చెప్పారు మనసు మార్చుకొమ్మని. వినలేదు. నన్నూ వాళ్ళ బంధువుల ద్వారా బెదిరించారు. నేనొక్కటే చెప్పాను-

ఏ నిర్ణయం తీసుకున్నా ఇద్దరం కలిసే తీసుకుంటాం. ఒకరి నొకరం మర్చిపోవాలనుకునే నిర్ణయాన్ని కూడా - అని.

దాంతో ఆమె పారిపోకుండా కాపలా వుంచి, హడావిడిగా మేచ్ చూసి సెటిల్‌చేసి, పెళ్ళి చేసేస్తున్నారు రేపే ముహూర్తం.

నేను తుళ్ళిపడ్డాను. మనసులో కలవరం లాంటిదేదో లేచింది. దాన్ని సప్రెస్ చేసే ప్రయత్నంగా అన్నాను 'రేపు చాలా పెళ్ళిళ్ళున్నట్టున్నాయి.'

'ఔను. రేపు తప్పిస్తే మళ్ళీ మూడు నెలలదాకా ముహూర్తాల్లేవు.'

మాటల్లో గమనించలేదు. మేం మెడికల్ కాలేజి కూడా



'... అంతేకాదు. ఈ పెళ్ళనేది ఆస్తిఅంతస్థుల్నీ, కులగోత్రాలనీ, వంశమర్యాదల్నీ ప్రకటించుకునే వేదిక. ఇన్‌ది అదర్ సెన్స్... అహాన్ని ప్రకటించుకుని పారస్పరికంగా సంతృప్తిపరచుకునే వేదిక. పిల్లల ఇష్టానిష్టాలని లక్ష్యపెడితే ఆ అవకాశాలు పోతాయి...'

దాటేశాము.

ఒక ప్రశ్న అడగకుండా వుండలేక పోయాను. 'మీ మధ్యని అమాయకుడైన మరో వ్యక్తి ఇరుకున పడటం లేదూ?'

'మనసులేని పిల్లతో అతను మాత్రం ఎంజాయ్ చెయ్యగలడా?'

'మొదటే అతన్తో చెప్తే బావుంటుంది కదా?'

'ఎవరు చెప్పాలి?'

'ఆమె... ఆమే'

'అతనడిగాడా?'

'అడక్కపోతే చెప్పక్కర్లేదా?'

'అతను తన పేరెంట్స్‌తో వచ్చి, ఆమెని చూసి, వన్‌సైడెడ్‌గా వోకే చెప్పేశాక ఏం చెప్తుంది? ఎవరికి చెప్తుంది?'

'నైతికత...?'

'అంటే? నాన్నకి నచ్చే కట్నమిచ్చి, అమ్మకి నచ్చేలా పనిపాటలొచ్చి, అక్కచెల్లెళ్ళతో సర్దుకుపోయే సరళస్వభావం వుండి, తన కోసం అందం ఒకటీ వుంటే చాలనుకునే అబ్బాయికి... ఆమె మనసుతో నిమిత్తంలేని వాడికి... నైతికతేమిటి?' అతని మాటలు పదునుగా ఉన్నాయి. నన్ను ఆలోచనలో పడేశాయి. అంతలోనే నవ్వూ వచ్చింది. రేప్పొద్దున్న... అంటే ఇంకొన్ని గంటల వ్యవధిలో పెళ్ళి పెట్టుకుని... ఇప్పుడాలోచనేమిటి?

'మెడికల్ కాలేజి దాటిపోయాము కదూ?' అడిగాడతను.

'మీకీ వూరు కొత్తన్నారు?' గుర్తుచేశాను.

'మై క్లెవర్ ఫియాన్సీ... అన్నీ డీటెయిల్డ్‌గా రాసింది. గుడికి వెళ్ళే దార్లో ఆర్చి ఉంటుందట. అక్కడ వెయిట్ చేస్తానంది.'

నేనక్కడ ఆపాను. ఒక ఆటో మాత్రం ఉందక్కడ.

'మీకు చాలా ట్రబులిచ్చాను. కానీ మీరు చేసిన హెల్ప్... వృధా అయిన మీ సమయంకన్నా విలువైనది. చాలా థేంక్స్... బైదిబై... మీరెక్కడ చేస్తారు?' అడిగాడు. నేను నా విజిటింగ్ కార్డిచ్చాను. దాన్ని జేబులో పెట్టుకుని, మరోసారి థాంక్స్ చెప్పి కారు దిగాడు.

అతన్ని చూసి, ఆటోలోంచీ ఒకమ్మాయి దిగింది.

నేను కారు టర్న్ చెయ్యబోయాను.

ఆమె అతనికి అభిముఖంగా నడుస్తోంది. ఆ డైరెక్షన్లో క్రీనీడ ఆమె ముఖం మీద పడ్తోంది. ఆమెని ఒక్కసారి చూడాలన్న కుతూహలం... జస్ట్... కుతూహలం... నన్నాపింది.

అతను కారు చూపించి ఏదో చెప్తున్నాడు. జరిగినదాన్ని గురించి కాబోలు ఆమె సడెన్‌గా తలతిప్పింది.

షాకయ్యాను.

మై మేరేజ్ విత్ ఇందూ... డేష్‌బోర్డు మీద వెడ్డింగ్ కార్డు నన్ను వెక్కిరించింది. తేరుకుని ఒక్కసారి కారుని ఉరికించాను. పెళ్ళింటికి కాదు. అక్కడింక నా అవసరం లేదు. పెళ్ళింట్లో ఉండాల్సిన పెళ్ళికూతురు తనని తనుగా ప్రేమించిన వ్యక్తితో రెక్కలు కట్టుకుని ఎగిరిపోతోంది.

★

